TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 88 | శుక్రవారం, జూలై 26, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.. అసెంబ్లీలో బడ్జెట్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు లు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా భట్టి అసెంబ్లీలో మాట్లాడుతూ... పదేళ్ల అస్తవ్యస్త పాలనకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడారు.. బంగారు తెలంగాణ చేస్తామని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారు.. గత ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు.. గత పదేళ్లలో ప్రభుత్వ అప్పు పది రెట్లు పెరిగింది.. వామనావతారం లెక్క అప్పులు పెరిగాయి.. ఓ వైపు అప్పులు పెరగగా, మరోవైపు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి అంటూ ధ్వజమెత్తారు. ఇక రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో తెలంగాణ బడ్జెట్ ను రూపొందించారు.. రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు.. మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ఉంది.. సాగునీటి పారుదల శాఖకు రూ.26 వేల కోట్లు.. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించారు.. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే దాశరథి కవితతో' బడ్జెట్‌ను భట్టి ప్రారంభించారు. గత పదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం సన్నగిల్లిందని, గత పదేళ్లలో అస్తవ్యస్త పాలన సాగడంతో అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. ఉద్యమ ఆకాంక్షలు ఎక్కడ నెరవేర్చలేదని, గత ప్రభుత్వం ఆర్థిక క్రమ శిక్షణ పాటించలేదని, జీతాలు, పింఛన్ల చెల్లింపులకు కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. గత ప్రభుత్వంలో నాయకులు బంగారు తెలంగాణ అంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారని భట్టి ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని, దిద్దుబాటు చర్యలు చేపట్టి మేలైన ప్రాజెక్టులు నిర్మిస్తామని, ఇప్పటివరకు రూ.34,579 కోట్లు వివిధ పథకాలకు ఖర్చు చేశామని వివరించారు. హైదరాబాద్ చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణానికి ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. కొత్త ప్రభుత్వ ఉద్యోగాల సృష్టి, నియామకాల్లో పారదర్శకతకు చర్యలు తీసుకుంటామని, త్వరలో నియామక ప్రణాళిక క్యాలెండర్ ప్రకటన ఇస్తామని భట్టి హామీ ఇచ్చారు. రైతు భరోసా సహా హామీలన్నీ త్వరలోనే అమలు చేసి తీరుతామని, బడ్జెట్ కేవలం అంకెల సమాహారం కాదన్నారు. బడ్జెట్ అనేది విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా వస్తుందని తెలియజేశారు.

## రుణమాఫీకి రూ.31వేల కోట్లు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి .. అసెంబ్లీలో బడ్జెట్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు లు ప్రవేశపెట్టారు.. ఈ సందర్భంగా భట్టి అసెంబ్లీలో మాట్లాడుతూ రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో తెలంగాణ బడ్జెట్ ను రూపొందించామన్నారు. రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు ఉండగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

## బడ్జెట్ పై సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్



హైదరాబాద్: ఆరు గ్యారెంటీల హామీ పత్రం బడ్జెట్ అని, ఆర్భాటాపు అంకెలు కాకుండా వాస్తవపు లెక్కల బడ్జెట్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2024–25కు సంబంధించిన వార్షిక బడ్జెట్ ను ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఇది ఆరు గ్యారెంటీల బడ్జెట్ అని స్పష్టం చేశారు.తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ బడ్జెట్‌ను రూపిందించిన భట్టి విక్రమార్క, ఆయన బృందానికి అభినందనలు అంటూ రేవంత్ రెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.

### మహిళా సంఘాల కోసం హైదరాబాద్‌లో...

## మూడున్నర ఎకరాలు భూమి

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతో దేశానికి మొత్తం తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలువబోతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ఫోకస్ పెట్టి బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తెలంగాణ దేశానికి మార్గదర్శకంగా ఉ ండబోతుందన్నారు.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కసరత్తు పూర్తయిందని, నిధులను సైతం కేటాయించామని ఆయన తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులను కేటాయించి దన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని మహిళా సంఘాలకు 20 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామని, వారు చెల్లించాల్సిన వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మైక్రో స్మాల్ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని, మహిళలు ఆర్థిక సాధికారత సాధించడానికి మైక్రో స్మాల్ ఇండస్ట్రీలను వారికి కేటాయిం చబోతున్నామని ఆయన తెలిపారు.

ప్రజా ప్రభుత్వం వారికి అందించే ప్రోత్సాహకాల వల్ల మహిళలు ఆర్థిక పరిపుష్టి తో ఆర్థిక సాధికారత సాధించి దేశానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలను మహాలక్ష్మిలుగా కొలుస్తామని, డ్వాక్రా సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువులను మార్కెటింగ్ చేసుకోవడానికి హైదరాబాద్‌లో మూడున్నర ఎకరాలు భూమిని మహిళల కోసం కేటాయిం చామని, రాష్ట్రంలో మహిళల కోసం సమానమైన దృష్టిని తమ ప్రభుత్వం కేంద్రీకరించి వారి అభివృద్ధికి పాటుపడుతుందని ఆయన తెలిపారు.

## తెలంగాణ బడ్జెట్ విశేషాలు:

తెలంగాణ బడ్జెట్: రూ.2,91,159 కోట్లు
రెవెన్యూ వ్యయం: రూ. 2, 20, 945 కోట్లు
మూలధన వ్యయం: రూ.33,487 కోట్లు
వ్యవసాయం: రూ.72,659 కోట్లు
ఎస్‌సి సంక్షేమం: రూ.33,124 కోట్లు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి: రూ.29,816 కోట్లు
నీటి పారుదల శాఖ: రూ.22,301 కోట్లు
విద్యారంగం: రూ.21,292 కోట్లు
ఎస్‌టి సంక్షేమం: రూ.17056 కోట్లు
ట్రాన్స్‌కో, డిస్కంలు: రూ.16,410 కోట్లు
వైద్య ఆరోగ్యం: రూ.11,468 కోట్లు
హైదరాబాద్ నగర అభివృద్ధికి: రూ.10000 కోట్లు
బిసి సంక్షేమం: రూ.9200 కోట్లు
హోంశాఖ: రూ.9,564 కోట్లు
ఆర్ అండ్ బి శాఖ: రూ.5790 కోట్లు
ప్రజాపంపిణీకి: రూ.3,836 కోట్లు
మెట్రో వాటర్ వర్క్: రూ.3,385 కోట్లు
జిహెచ్‌ఎంసి మౌలిక వసతుల కల్పన: రూ.3,065 కోట్లు
మైనార్టీ సంక్షేమం: రూ.3003 కోట్లు
స్త్రీ, శిశు సంక్షేమం: రూ.2736 కోట్లు
పరిశ్రమల శాఖ: 2762 కోట్లు
గృహజ్యోతి పథకం: రూ.2418 కోట్లు
పశుసంవర్ధకం: రూ.1980 కోట్లు
మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు: రూ.1500 కోట్లు
ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు: రూ.1525 కోట్లు
అడవులు, పర్యావరణం: రూ.1064 కోట్లు
రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం: రూ.723 కోట్లు
ఉద్యానవనం: రూ. 737 కోట్లు
ఐటి రంగం: రూ.774 కోట్లు
హైడ్రా సంస్థ: రూ.200 కోట్లు
పాతబస్తీ మెట్రో విస్తరణ: రూ.500 కోట్లు
హెచ్‌ఎండిఎలో మౌలిక వసతుల కల్పన: రూ.500 కోట్లు
విమానాశ్రయ వరకు మెట్రో విస్తరణ: రూ.100 కోట్లు
మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్: రూ.50 కోట్లు

### మాదాపూర్‌లో రేవ్ పార్టీ...

## రియల్టర్లు, విద్యార్థులు అరెస్ట్



హైదరాబాద్: మాదాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన రేవ్ పార్టీని తెలంగాణ టాస్క్‌ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. ఈ పార్టీవి వచ్చిన 14 మంది యువకులతో పాటు ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు పార్టీ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అయితే, ఈ రేవ్ పార్టీలో ఒక గ్రాము కొకైన్, రెండు గ్రాముల ఎండీఎంఏ, డ్రగ్స్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1.25 లక్షల విలువైన మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బేగంపేటకు చెందిన నాగరాజు పుట్టినరోజు సందర్భంగా ఈ రేవ్ పార్టీ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఈవెంట్ ప్రమోటర్ కిషోర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కేజ్రీవాల్, సిసోడియా, కవితల జ్యుడీషియల్ కస్టడీని పొడగించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ఎక్సైజ్ స్కామ్ తాలూకు మనీ లాండరింగ్, అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని గురువారం పొడగించింది. ఈడి దర్యాప్తు చేస్తున్న మనీలాండరింగ్ కేసులో జులై 31 వరకు, సిబిఐ దాఖలు చేసిన అవినీతి కేసులో ఆగస్టు 8 వరకు కేజ్రీవాల్ కస్టడీని ప్రత్యేక జడ్జీ కావేరి బవేజా పొడగించారు. మనీ లాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉ పముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, బిఆర్ఎస్ నాయకురాలు కె. కవిత , ఇతర నిందితుల జ్యుడీషియల్ కస్టడీని కూడా జడ్జి జులై 31 వరకు పొడగించారు. నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశపెట్టారు. సుప్రీం కోర్టు ఇదివరలో ఈడి కేసులో కేజ్రీవాల్ కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అయినా ఆయన ఇప్పటికీ తీహార్ జైలులో ఉన్నారు. కారణం ఆయన కేసులో బెయిల్



బాండ్ సమర్పించలేదు. ఆయన సిబిఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

### కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న

## ప్రియాంక ధర్మపురి



నిజామాబాద్ : 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జమ్మూకాశ్మీర్ స్టడీ సర్కిల్ వారి ఆధ్వ ర్యంలో గురువారం సీఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్ సతీమణి ప్రియాంక ధర్మపురి పాల్గొన్నారు. అమర వీరుల స్మృతిలో మొక్కను నాటారు. అనంతరం కార్గిల్ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ సి ఎస్ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఎయిర్ కమాండర్ వి.ఏం రెడ్డి, బీజేపీ తమిళనాడు అధ్యక్షులు అన్నామలై కుప్పుస్వామి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ లు పాల్గొన్నారు.

# ఇది తిరోగమన బడ్జెట్ : హరీశ్ రావు



హైదరాబాద్ : ఎన్నికల్లో గ్యారెంటీల గారడీ.. బడ్జెట్‌లో అంకెల గారడీగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ఉందంటూ ఎద్దేవా చేశారు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీశ్ రావు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో నేడు మీడియాతో మాట్లాడుతూ, ఆసరా పెన్షన్ల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు పేదల ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని అన్నారు.

ఇది రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపే బడ్జెట్ అని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తేకపోవడం దారుణమని అన్నారు. ఆర్భాటంగా అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆరు గ్యారెంటీ ఊసెత్తలేదని మండిపడ్డారు.

ఆసరా పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారని, వృద్ధుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు.

ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న సర్కారు.. ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడలేదని, మాయమాటలతో విద్యార్థులను మోసం చేసిందని హరీష్‌రావు మండిపడ్డారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పారని, ఇప్పుడు ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు.

**సూపర్ స్టార్ కు కనిపించిన అభివృద్ధి ఈ ఘజినీ స్టార్ లకు కనిపించదు**

మేనిఫెస్టోను ప్రతిబింబించేలా బడ్జెట్ ఉండాలి కానీ దురదృష్టవశాత్తూ అలా లేదని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన నెలకు రూ.2500 సాయం కోసం కోటి మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు అయినప్పటికీ మహిళలకు ఆర్థిక సహాయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యా భరోసా కార్డు అంశాన్ని ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. కొత్త రేషన్ కార్డు ఎప్పటీ నుండి ఇస్తారో చెప్పలేదు. జ్యాబ్ క్యాలెండర్ ప్రస్థావన లేదని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని తాము నిర్లక్ష్యం చేశామని భట్టి పేర్కొనడం పట్ల హరీశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని బీఆర్ఎస్ కొనసాగించిందని చంద్రబాబు అన్నారు. హైదరాబాద్ డెవలప్మెంట్‌ను సూపర్ స్టార్ రజనీ కాంత్ పొగిడారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి రజనీకి కనిపించింది కానీ కాంగ్రెస్ గజినీలకు కనిపించలేదు అని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన కారణంగానే తెలంగాణ తలసరి ఆదాయం పెరిగిందన్నారు.

# సీఎం వర్సెస్ కెటిఆర్

హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు అంశంపై అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా సాగాయి. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని బుధవారం శాసనసభలో ముక్తకంఠంతో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం కొనసాగింది. ముఖ్యమంత్రి రే వంత్ రెడ్డి మాట్లాడుతూ, కెటిఆర్ అవగాహనారాహిత్యంతో సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు కెసిఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దీనిపై కెటిఆర్ స్పందిస్తూ 'మాకు జవాబు చెప్పండి చాలు, మీ స్థాయి మేము చాలా... మీకు కెసిఆర్ అక్కర్లేదు అని అనడంతో రే వంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రే వంత్‌రెడ్డి మాట్లాడుతూ, తండ్రి పేరు చెప్పుకొని తాను మంత్రిని కాలేదని, కింది స్థాయి నుంచి ఎది గి ముఖ్యమంత్రిని అయ్యానని పేర్కొన్నారు. కెటిఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నానని, అంతకంటే దారుణమని ఎద్దేవా చేశారు.



ఆ వెంటనే కె టిఆర్ స్పందిస్తూ, రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో సిఎం అయ్యారని మేమూ అనొచ్చునని బదులిచ్చా రు. తండ్రి పేరు చెప్పుకొని వచ్చానని సిఎం రాహుల్‌గాంధీని అంటున్నారో..రాజీవ్‌గాంధీని అంటున్నారో తెలియదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మళ్లీ కౌంటర్ ఇస్తూ, పేమెంట్ కోటాలో సిఎంను కాలేదని, ఇటీవల బిఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి చీకటి ఒప్పందాలు చేసుకుని వచ్చారని ఆరోపించారు. అందుకు కెటిఆర్ స్పందిస్తూ రేవంత్ రెడ్డి చిన్న వయస్సులోనే సీఎం అయ్యారని, చిన్న వయస్సులోనే సీఎం అయినందుకు రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కష్టపడే ఈ స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. తాము ఏం మాట్లాడాలో కూడా మీరే చెబితే ఎట్లా ..? మంత్రులను, స్పీకర్‌ను ఉద్దేశించి కెటిఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కులను శాసించి సా ధించుకోవాలని, యాచిస్తే ఏమీ రాదని అన్నారు. కేంద్రం వివక్షను ఎండగట్టడంలో తాము సహకరిస్తామని తెలిపారు.

**ఇంతకాలానికి కాంగ్రెస్ సర్కార్‌కు ఢిల్లీతత్వం బోధపడింది**

బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, కేంద్రం నుంచి రావలసిన నిధుల కోసం శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశామని కెటిఆర్ అన్నారు. కేంద్రం సాయం చేయకపోయినా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంతకాలానికి ఢిల్లీతత్వం బోధపడిందని పేర్కొన్నారు. తెలంగాణ హక్కులు ఎవరు హరించినా వారి మెడలు వంచుతామని స్పష్టం చేశారు. విభజన సమయంలో తెలంగాణ హక్కుల కోసం ఎంతో పోరాడామని, మోదీ సర్కారుపై తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేసినట్లు వ్యాఖ్యానించారు. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మీకేం ఇబ్బందని కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశిస్తూ కెటిఆర్ ప్రశ్నించారు.

## ఒడిశా అసెంబ్లీలో...

# పోలవరంపై రచ్చ



భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం డ్యాం ప్రాజెక్టుపై ఒడిశా అసెంబ్లీలో గురువారం తీవ్ర రభస జరిగింది. పోలవరం ప్రాజక్టు కారణంగా ఒడిశాలోని గిరిజనుల ప్రాబల్యంగల మల్కన్‌గిరి జిల్లాలోని భారీ విస్తీర్ణంలో భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ఈ ప్రాజెక్టు వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేసేందుకు ఒక సభా సంఘాన్ని నియమించాలని కోరుతూ ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు సభలో అలజడి సృష్టించారు. జీరో అవర్‌లో కాంగ్రెస్ సభాపక్ష నాయకుడు రామచంద్ర కదం ఈ అంశాన్ని లేవనెత్తారు.

మల్కన్‌గిరి జిల్లాలో 1400 హెక్టార్ల నుంచి 1500 హెక్టార్ల భూమిని ముంపునకు గురిచేసే పోలవరం ప్రాజెక్టును బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా మల్కన్‌గిరి జిల్లాలోని అమాయక గిరిజనులు, పేద ప్రజలు బాధితులుగా మారనున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా బాధితులుగా మారే ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం చేపట్టడాన్ని ఆయన తప్పుపట్టారు. పోలవరం ప్రాజెక్టును, మల్కన్‌గిరి జిల్లాలోని ప్రజలపై దాని ప్రభావాన్ని చర్చించేందుకు ఒక సభా సంఘాన్ని నియమించాలని ఆయన డిమాండు చేశారు. పోలవరం ప్రాజెక్టు ప్రభావం ఒడిశాలోని అడవులు, వన్యప్రాణులు, స్థానిక పర్యావరణంపై కూడా పడుతుందని ఆయన చెప్పారు. ఒడిశా నుంచి ఎన్నికైన 20 మంది ఎంపీలు, దబుల్ ఇంజిన్ ప్రభుత్వం మల్కన్‌గిరి జిల్లా ప్రజల ప్రయోజనాలను కాపాడడంలో విఫలమయ్యాయని కదం ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అధికార పార్టీని సంతృప్తి పరిచి తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పోలవంరం ప్రాజెక్టును ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు.

కేంద్రం చర్యలను నిరసిస్తూ ప్రజా ఉద్యమాన్ని తమ పార్టీ చేపడుతుందని ఆయన తెలిపారు. పోలవరం అంశాన్ని కాంగ్రెస్ చేపట్టిన సమయంలో సభలో ఉన్న బిజెపి సభ్యులు మౌనంగా ఉన్నారు. స్పీకర్ సురమ పథి ఈ వ్యవహారంపై స్పందించకపోవడంతో ఇందుకు నిరసనగా కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు తారాప్రసాద్ బహినిపతి నేతృత్వంలో ఆ పార్టీ సభ్యులు సభ మధ్యలోకి దూసుకువెళ్లి పోలవరం ప్రాజెక్టుపై సభా సంఘం వేయాలని డిమాండు చేశారు. స్పీకర్ పోడియంపైకి ఎక్కేందుకు బహినిపతి ప్రయత్నించగా రిపోర్టర్లకు చెందిన టేబుల్‌పైన నిలబడి కదం నిరసన తెలిపారు.

# ఆ బిడ్డకు తండ్రి ఎవరు... విజయసాయిరెడ్డికి డిఎన్ఎ టెస్టు చేయాలి : శాంతి భర్త



ఢిల్లీ: వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి, ఆయన అనుచరుడు పోతిరెడ్డి సుభాష్ రెడ్డిలు తన భార్య శాంతిని రాజకీయ ప్రాద్బలంతో వాడుకున్నారని ఆమె భర్త మదన్‌మోహన్ ఆరోపణలు చేశారు. తన భార్య శాంతను శారీరకంగా విజయసాయి రెడ్డి వాడుకొని బిడ్డను కన్నారని ఆయనకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో వివిధ దళిత, గిరిజన, బహుజన సంఘాలతో కలిసి ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని అడ్డం పెట్టుకొని దేవాదాయ శాఖకు చెందిన రూ.1000 కోట్ల భూమని కొల్లగొట్టారని మదన్ విమర్శలు గుప్పించారు. గిరిజనులకు అన్యాయం చేసిన విజయసాయి రెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. దళిత సంఘాలతో కలిసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌లను కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మదన్‌మోహన్ భార్యకు పుట్టిన బిడ్డకు తండ్రి ఎవరు అని దళిత, గిరిజన సంఘాలు ప్రశ్నించాయి. విజయసాయి రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. విశాఖపట్నంలో జరిగిన భూకుంభకోణాలపై దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశాయి. వైఎస్ఆర్ సిపి నుంచి విజయ సాయిరెడ్డి బహిష్కరించాలని డిమాండ్ చేశాయి.

## మహారాష్ట్రలో వర్ష బీభత్సం.....

# ఆరుగురి మృతి

ముంబై: మహారాష్ట్రలో ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురుస్తుండడంతో అనేక ప్రాంతాలు నీటిలో మునిగి తేలుతున్నాయి. గురువారం భారీ వర్షాలకు వివిధ సంఘటనలకు సంబంధించి మొత్తం ఆరుగురు బలయ్యారు. పుణెలో మొత్తం నలుగురు చనిపోగా వీరిలో ముగ్గురు కరెంట్‌షాక్‌కు బలయ్యారు. థానే బర్విడామ్‌లో వరద నీటిలో ఇద్దరు మునిగి మృతి చెందారు. భారీ వర్షపాతంతో ముంబై, పాల్ఘర్‌లకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు ముంబైలో వాతావరణ విభాగం రెడ్ అలర్ట్ జారీ చేసింది.




ముంబై శాంతాక్రూజ్ లోని అబ్జర్వేటరీ ఈ నెలలో ఇంతవరకు 1500 మిమీ వర్షపాతాన్ని నమోదు చేసి, ముంబై నగర చరిత్రలో రెండో భారీ వర్ష జులై నెలగా రికార్డుకెక్కింది. గత ఏడాది ముంబైలో జులై లోనే 1771 మిమీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. రాష్ట్రం లోని కుండాలిక, అంబ నదులతోపాటు మొత్తం నాలుగు నదులు ప్రమాదస్థాయి మించి వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదీతీర ప్రాంతంలో ఉన్న గ్రామాలకు , ఇతర నివాసాలకు ముంపు ముప్పు పొంచి ఉండడంతో లోతట్టు ప్రజలను వేరే చోటికి తరలిస్తున్నారు. ముంబై ఛత్రపతి శివాజీ విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న మిథి నది ప్రమాదస్థాయికి కేవలం ఒక మీటరు దిగువన ప్రవహిస్తోంది. వర్షాల కారణంగానే విమాన సర్వీసులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. విమానాల రాకపోకల్లో ఆలస్యం జరుగుతోందని ఇండిగో, స్పైస్‌జెట్ సంస్థలు ప్రయాణికులను హెచ్చరించాయి. విమాన సర్వీస్‌లు రద్దు కావడంతో ప్రయాణికులకు ఎయిర్ ఇండియా రిఫండ్ చేస్తోంది. ముంబై నగరంలా పుణె కూడా భారీ వర్షాలతో సతమతమవుతోంది. శుక్రవారం ఉదయం వరకు రెడ్ అలర్ట్ జారీ అయింది. ఏక్తానగ్రి, విఠల్ నగర్, కల్యాణినగర్ లోని హౌసింగ్ సొసైటీలు భారీ వరద నీటితో అల్లాడుతున్నాయి. డైజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లను అవసరమైతే సహాయం అందించడానికి సిద్ధం చేశారు. స్కూళ్లు, కాలేజీలు మూత పడ్డాయి. పింప్రి చించివాడ లోని మోర్య గోసవి గణపతి ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. డిప్యూటీ సిఎం అజిత్ పవార్ వరద బాధిత ప్రాంతాలను సందర్శించారు. సహాయ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

పుణెకు 65 కిమీ దూరంలో లావాసాలో కొండచరియలు విరిగి పడి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. రాయ్‌గఢ్ జిల్లాలో మహద్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియాలో చిన్న వాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. సతారా జిల్లా లోని కొయనా డ్యామ్ ఆరు గేట్లు కొంత తెరవడంతో 11,000 క్యూసెక్కుల నీరు బయటకు పెల్లుబికి ప్రవహించింది. డ్యామ్‌లోని నీటి మట్టాన్ని నియంత్రించడానికి సాయంత్రం ఏడు గంటల సమయంలో మళ్లీ గేట్లు తెరిచారు. ముంబైకి 60 కిమీ దూరంలో ఉన్న బాదల్‌పూర్‌లో వరద ముప్పు పొంచి ఉంది. దీనికి ఉల్హాస్ నది ప్రమాదస్థాయిని మించి ప్రవహించడమే కారణం. బాదల్‌పూర్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.అక్కడి ప్రజలను వేరే చోటికి తరలించారు.

# పాక్ యువకుడితో థానే యువతి ప్రేమాయణం

## - నకిలీ పాస్ పోర్టుతో పాక్ కు వెళ్లి ఏం చేసిందంటే?



ముంబయి: సోషల్ మీడియాలో భారత్ కు చెందిన యువతికి పాకిస్థాన్ కు చెందిన యువకుడు పరిచయం కావడంతో ప్రేమగా మారింది. నకిలీ పాస్‌పోర్టు తీసుకొని పాకిస్థాన్‌కు వెళ్లి అక్కడ ప్రేమపెళ్లి చేసుకొని తిరిగి ఆమె ఇండియాకు వచ్చిన సంఘటన మహారాష్ట్రలోని థానేలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ొ% పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌కు చెందిన బాబర్ బషీర్ అహ్మద్‌కు థానేకు చెందిన నగ్మా ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. పరిచయం ప్రేమగా మారడంతో ఆన్‌లైన్‌లో వివాహం చేసుకున్నారు. నగ్మా పాకిస్థాన్ వెళ్లేందుకు ప్రయత్నం చేసింది. పాస్‌పోర్టు తిరస్కరణకు గురికావడంతో వెళ్లలేకపోయింది. వెంటనే నగ్మా తన పేరును నూర్ మక్సూద్ అలీ సనమ్ ఖాణ్ రూక్‌గా మార్చుకొని పాస్‌పోర్ట్ సంపాదించింది. పాకిస్థాన్‌కు వెళ్లి బాబర్‌ను ప్రేమ పెళ్లి చేసుకొని మళ్లీ జులై 17న థానేకు తిరిగొచ్చింది. లోకమాన్య నగర్‌లోని ఓ కేంద్రం నుంచి ఎక్కువగా నకలీ డాక్యుమెంట్లు సృష్టించి పాస్‌పోర్ట్, వీసా పొందినట్లు అధికారులు గుర్తించారు. నగ్మా నకిలీ పాస్‌పోర్టు సహాయంతో పాక్‌కు వెళ్లి తిరిగొచ్చినట్టు గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఆమెకు మధ్యవర్తులుగా ఉండి పాస్‌పోర్టు ఇప్పించిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె పాక్‌లో పెళ్లి చేసుకున్న మ్యారేజ్ సర్టిఫికెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగ్మా స్వస్థలం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం. 2015లో భర్తతో విడిపోయిన తరువాత నగ్మా పేరు మార్చుకుందని, పోలీసుల ఆరోపణలను ఆమె తల్లి తీవ్రంగా ఖండించింది.

## సంపాదకీయం

శుక్రవారం, జూలై 26, 2024

# సాహిత్య ఉద్యమంలో చలసాని ప్రస్థానం...!

చలసాని ప్రసాద్ ప్రముఖ కవి,రచయిత, విమర్శకులు. ఆయన విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులు. విప్లవ రచయితగా, ప్రజా ఉద్యమాలను సమర్థించే కార్యకర్తగానే ఆయన జీవితమంతా గడిపారు. ఉద్యమాల అణచివేతపై గళమెత్తారు. ఈ క్రమంలో అనేక సార్లు జైలుకు వెళ్లారు. విరసం ప్రస్థానంలో చలసానిది చెరగని ముద్ర. చలసాని ప్రసాద్ స్వస్థలం కృష్ణా జిల్లా లోని భట్ల పెనుమర్రు. డిసెంబరు 8 1932 న కృష్ణానదీ తీరంలోని చల్లపల్లి దగ్గరిలో నాదెళ్ళవారి పాలెంలో జన్మించారు. విరసం స్థాపనలో ఆయనది కీలకమైన పాత్ర. అత్యవసర పరిస్థితి కాలంలో ఆయన జైలుకు వెళ్లారు. నమ్మిన విప్లవ సిద్ధాంతానికి కట్టుబడిన ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభవించారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా ఆయనకు మంచి పేరుంది., కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, కెవిఆర్‌లతో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. పలు గ్రంథాలను ఆయన సంకలనం చేశారు. శ్రీశ్రీ సాహిత్యంపై ఆయనకు ఎనలేని పట్టు ఉండేది. సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాల్లో ఆయన ముఖ్యమైన భూమిక పోషించారు చలసాని ప్రసాద్. విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన చివరి శ్వాస వరకు పాల్గొంటూ వచ్చారు. కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగానే కొనసాగారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో కీలక పాత్రవహించిన చలసాని ప్రసాద్.. నమ్మిన సిద్ధాంతాలకోసం చాలా మందితో విభేదించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఎమర్జెన్సీ కాలంలో చలసాని ప్రసాద్ జైలు శిక్ష అనుభవించారు. సాహితీ విమర్శకుడుగా ఎందరికో స్ఫూర్తి నిచ్చారు. విప్లవ రచయితల సంఘం స్థాపనలో శ్రీశ్రీతో కలిసి పనిచేశారు. ప్రజా ఉద్యమాల అణిచివేతలపై జీవితకాలం పోరాడారు. ఎన్నోసార్లు జైలు జీవితం గడిపాడు. శ్రీశ్రీ, రంగనాయకమ్మలకు చలసాని అత్యంత సన్నిహితులు. ఆయన విశాఖపట్నం ఎ.వి.ఎన్ కళాశాల నుంచి రాజనీతి శాస్త్రం అధ్యాపకునిగా పదవీ విరమణ చేశారు. హెచ్.బి.కాలనీ, విశాఖపట్నంలోని ఆయన గృహంలో అనేక 20 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. అందులో ఎక్కడా లభించని అరుదైన పుస్తకాలు ఉన్నాయి. ఆయన అనేక విషయాలలో లోతుల వరకు చర్చించేవారు. ఆయన వద్ద ఉన్న పుస్తకాల ఆధారంగా ఎందరో పీహెచ్‌డీలు చేశారు. ఆయన వామపక్ష భావజాలం కలిగి ఉన్నప్పటికీ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య సమావేశాలకు ఎప్పుడూ హాజరయ్యేవారు. ఆయనకు రచలనంటే ఆసక్తి ఎక్కువ. పధ్నాలుగేళ్లు కష్టపడి ఇరవై భాగాలుగా శ్రీశ్రీ సాహితీ సర్వస్వాన్ని ప్రచురించినా, అదే తరగని ఉత్సాహంతో రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుల సాహిత్యమంతటినీ సంపుటాలుగా వెలువరించినా అది చలసానికే చెల్లింది. కృష్ణాజిల్లాలోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన చలసాని ప్రసాద్ బాల్యం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని చూస్తూ, ఆస్వాదిస్తూ పెరిగారు. తెలంగాణా సాయుధ పోరాటంలో ఆయన కుటుంబం ప్రత్యక్షంగా పాలుపంచుకుంది. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి మార్క్సిస్టుగా పెరిగి, విప్లవ రచయితగా స్థిరపడ్డ చలసాని జీవితం ఎన్నో ప్రత్యేకతల సమాహారం. సాహిత్య రంగంలో ఆయన కృషి ఎన్నదగినది. సాహిత్యోద్యమాల నిర్మాణంలో గత అర్ధ శతాబ్దంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విరసం వ్యవస్థాపకత్వంలో ఆయనది ప్రధానమైన పాత్ర. ఆయన పేరు ఎవరు ప్రస్తావించినా విరసం ప్రసాద్ అంటారు. విరసం దాదాపుగా ఆయన ఇంటిపేరై పోయింది. ప్రసాద్ సాహితీ సృజన తక్కువేమీ కాదు. కవిత్వం, వ్యాసాలు రాశారు. అవసరమైనప్పుడల్లా సామాజిక, రాజకీయ అంశాల మీదా రాశారు. అయితే ఉద్యమ జీవు లందరికి లాగే తన సృజనాత్మక శక్తిని ప్రోది చేసుకుని, పదిల పరచుకుని ఆ రంగంలో కీర్తి సంపాదించాలన్న దుగ్ధ ఆయనకేనాడూ లేదు. 1970లో విరసం ఏర్పడినప్పటి నుంచి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. 1985 నుంచి 88 వరకు మూడేళ్ల పాటు విరసానికి కార్యదర్శి. 1998 నుంచి 2002 వరకు అధ్యక్షులు. అయినా ఆయన సాహిత్యోద్యమంలో తనను తాను కార్యకర్తగానే పరిగణించే వారు. సాహితీ రంగం కూడా ఆయనను అదే దృష్టితో చూసింది. తొమ్మిదో తరతి విద్యార్థిగా ఉన్నప్పుడు 1947 "నవయుగ" సంచికలో "ఓ విద్యార్థి సోదరుడా, సమ్మెయే మన ఆఖరి ఆయుధమోయ్" అన్న పాటతో మొదలు పెట్టి కవిత్వం, సాహిత్య విమర్శ, ముందు మాటలు, సాహిత్య, రాజకీయ అంశాల మీద వ్యాసాలు దండిగానే రాశారు. చాలా కాలంపాటు ఒకటి రెండు అనువాదాలు తప్ప స్వతంత్ర రచనలుగా ప్రచురించడం మీద ఆయన దృష్టి ఎన్నడూ లేదు. 2008లో "సాహిత్య వ్యాసాలు", 2010లో "చలసాని ప్రసాద్ రచనలు" వెలువడ్డాయి. ఇంగ్లీషును ఎదిరించి నిలిచిన భాష తెలుగు. ఏ భాషా పదాన్నయినా తనలో కలుపుకొని ఎదిగే శక్తి తెలుగుకు ఉంది. అందుకే తెలుగు అజరామరం. తెలుగు భవిష్యత్తు ఉజ్వలం అని చలసాని చెపుతుండే వారు. చలసాని జూలై 25, 2015న విశాఖపట్టణం లోని తన నివాసంలోనే గుండెపోటుతో తుది శ్వాస విడిచారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

### - విద్యార్థులకు పాఠాలు బోధించిన - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా






**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ:** వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, భవనం, స్విచ్ బోర్డ్స్, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, టాయిలెట్స్, కళాశాల మైదానం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గతేడాది ఇంటర్ ఫలితాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ కళాశాల మైదానంలో నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తరగతి గదులు, ఆవరణలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కళాశాలలో కావాల్సిన సౌకర్యాలపై ఒక నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ తెలిపారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వెస్లీ పాఠశాలను ప్రభుత్వం హస్తగతం చేసుకొని నిర్వహించాలి: జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం




**ఉప్పల్ జూలై 25 :** ఉప్పల్ నియోజకవర్గం నాచారంలో ఉన్న ఎయిడెడ్ వెస్లీ పాఠశాలను ప్రభుత్వం హస్తగతం చేసుకొని నిర్వహించాలని జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. వెస్లీ పాఠశాలను ప్రొఫెసర్ కోదండరాం తో పాటు జన సమితి విద్యార్థి విభాగం అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధ్యాయులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఇక్కడ ఉపాధ్యాయులు సహకారంతో పాఠశాల నడుస్తుందని కొద్ది రోజుల్లో ఉపాధ్యాయులు పదవి విరమణ చేస్తే పాఠశాల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందిస్తున్న పాఠశాల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం కి ఉందని అన్నారు. పూర్తి సౌకర్యాలతో ఉన్న పాఠశాలను ప్రభుత్వం హస్తగతం చేసుకొని ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను నిర్వహించవచ్చని అన్నారు.

# నిరుపేద కుటుంబాలకు మరియు వికలాంగులకు సేవ చేయడమే తమ సఖి సంస్థ లక్ష్యం అని అన్నారు : నరాల సత్యనారాయణ





**ఖమ్మం జూలై 25:** సఖి జాతీయ మహిళా మండలి వారి ఆధ్వర్యంలో శ్రీ నరాల సేవ చారిటబుల్ ట్రస్ట్ వారి సమర్పణలో వారి నేతృత్వంలో 55 పేద కుటుంబాలకు వికలాంగులకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ పేదలందరికీ సేవ చేయడమే తమ సఖీ జాతీయ మహిళా మండలి లక్ష్యమని, ఇప్పటివరకు ఈ సంస్థల ద్వారా 501 కుటుంబాలకు సహాయం అందించామని 150 మంది పేద విద్యార్థులను ఈ సంస్థ చదివిస్తోందని నిరుపేదలకు వికలాంగులకు తమ సంస్థ అండగా ఉంటుందని, ఒక ఖమ్మం లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా అలాగే అమెరికా ఆస్ట్రేలియా సింగపూర్ దేశాలలో కూడా తమ సేవా కార్యక్రమాలు విస్తరించాయని తెలుపుతూ, సంస్థలో పనిచేస్తున్న వారందరూ కూడా నిస్వార్థంతో సేవా దృక్పథంతో నిరుపేదలకు సేవను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమానంతరం సంస్థలో నిస్వార్థంతో సేవ చేయడానికి వచ్చిన ఖమ్మం జిల్లా నుండి 100 మంది మహిళలకు ఐడెంటిటీ కార్డ్స్ ని డిస్ట్రిబ్యూషన్ చేశారు . ఈ కార్యక్రమంలో నేషనల్ ట్రెజరర్ రాయల సంధ్య , నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనిక గౌరీ, నేషనల్ కన్వీనర్ కనగంటి నాగమణి, నేషనల్ డైరెక్టర్ ఇటికాల మాధవి, నేషనల్ కో కన్వీనర్ కొలిపాక నాగమణి, నేషనల్ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ కనకబండి విజయలక్ష్మి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఉప్పెర్ల శ్రీవాణి, నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దామస్వరూప, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ లు చావ శాంతి, సింధు, బాజీ, గిరిజ, నాగబత్తుల మంగా దేవి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షాహిన్, నేషనల్ కమిటీ మెంబర్స్ దిరిషాల ఉమా, రణబోతు ఉమా, మహేశ్వరి, మాధవి, నాగమణి, సోనీ, సాజిదా, నేషనల్ అడ్వైజర్ ప్రేమ కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీత, స్టేట్ జాయింట్ సెక్రటరీ చాంద్ బి తదితరులు పాల్గొన్నారు.

# బీసీల బడ్జెట్ రూ.20 వేల కోట్లకు పెంచాలి : జాజుల లింగంగౌడ్



**తార్నాక, జూలై, 25 :** అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర బడ్జెట్ రూ.2,91,191 లక్షల కోట్ల బడ్జెట్లో జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీలకు కేవలం రూ.9,200 కోట్లు కేటాయించడం చాలా దారుణమని అన్నారు.ఈ యొక్క బడ్జెట్ బీసీలకు ఏమాత్రం సరిపోదని అన్నారు.బీసీల బడ్జెట్ 20 వేల కోట్లకు పెంచాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.నిరుద్యోగ బీసీ యువతకు బీసీ కార్పొరేషన్ ద్వారా నిధులిచ్చి ఆదుకోవాలని కోరారు. ఎన్నికల ముందు బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని ఇప్పుడు ఆ ఊసేలేదని అన్నారు. వెంటనే బీసీలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసిన శ్రీ లక్ష్మి నరసింహా స్వామి కాలనీ నూతన కార్య వర్గం



**ఉప్పల్,జూలై 25 :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని ఏ ఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన లక్ష్మి నరసింహ స్వామి కాలనీ న్యూతన కార్యవర్గ సభ్యులు కాలనీ అభివృద్ధి కి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని, కాలనీ అభివృద్ధికి అవసరమైతే, సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీ లోని సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ నరసింహా, జె సుధాకర్, ట్రెజరర్ శ్రీనివాస్, పరమేష్ చారి, దాము, కృష్ణ, బిఆర్ఎస్ నాయకులు ఎన్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల దాడుల నియంత్రణకు ప్లాన్

**హైదరాబాద్:** హైదరాబాద్ పరిధిలో ఈ మధ్య వీధి కుక్కల వల్ల తలెత్తుతున్న సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. చిన్నారుల పైన వీధి శునకాలు మూకుమ్మడిగా దాడి చేస్తున్న ఘటనలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో అయితే, పసి పిల్లలను కూడా కుక్కలు చంపేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీని కారణంగా ప్రజలు తమ పిల్లలను రోడ్లపై ఆటలకు పంపేందుకు సైతం జంకుతున్నారు. ఎటు వైపు నుంచి ఏ వీధి కుక్క వచ్చి దాడి చేస్తుందో అని భయపడిపోతున్నారు.'మీ ఏరియాలో కుక్కల బెడద ఉందా? అయితే, టోల్ ఫ్రీ నంబర్లు 040-21111111, 040-23225397కి కాల్ చేసి ఫిర్యాదు చేయండి. మా డాగ్ క్యాచింగ్ టీంలు నేరుగా వచ్చి వీధి శునకాలను సంరక్షణ కేంద్రాలకు తరలించి స్టెరిలైజేషన్ చేస్తాయి" అని జీహెచ్ఎంసీ ఓ ప్రకటనలో తెలిపింది.ఒక్క హైదరాబాద్‌లోనే 4 లక్షల వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం ఉందని ఈ మధ్యే ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వెల్లడించింది. తెలంగాణలో రోజూ ఏదో ఒక ప్రాంతంలో కుక్కలు కరుస్తు?న్న ఘటనలు జరుగుతున్నాయని వీటిని నియంత్రించాలని ఈ మధ్యే ప్రభుత్వానికి ఒక లేఖ కూడా రాసింది. భారత జంతు సంక్షేమ సంఘం గైడ్ లైన్స్ ఏమాత్రం ఆచరణయోగ్యంగా లేవని.. ప్రజల ప్రాణాల కన్నా కుక్కల ప్రాణాలకే ప్రాధాన్యం ఇచ్చేలా నిర్ణయాలు ఉన్నాయని అన్నారు. కుక్కలను మానవతా దృక్పథంతో చూడాలని అనడంలో అభ్యంతరం లేదని అన్నారు. తెలంగాణలో ప్రమాదకరంగా ఉన్న ఈ వీధి కుక్కలను నిర్మూలించడం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రభుత్వానికి రాసిన లేఖలో కోరింది.సీఎం రేవంత్ సమీక్షవీధి కుక్కలు పిల్లల్ని కరుస్తున్న ఘటనలు పెరిగిపోవడంతో ఇటీవల హైకోర్టు కూడా సుమోటోగా విచారణ చేసింది.

# మెదక్ జిల్లాల్లో కుటుంబ నియంత్రణలు బంద్

**మెదక్:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు అన్ని వైద్యసేవలు అందుబాటులో ఉండాలని పాలకులు పదే పదే చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. కుటుంబ నియంత్రణ కోసం గతంలో పాలకులు 'ఒకరు చాలు.. ఇద్దరు ముద్దు' అనే నినాదంతో ఎన్నో సదస్సు నిర్వహించి అవగాహన కల్పించి మరి క్యాంప్ లు నిర్వహించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. కానీ రెండేళ్లుగా మెదక్ లో ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిగా నిలిపి వేయడంతో మహిళలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి జిల్లా కేంద్రంలో నెలకొంది.మెదక్ జిల్లాలో మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో పాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట ఏరియా ఆసుపత్రులు, 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. రామాయంపేటలో కేవలం నార్మల్ డెలివరీలు మాత్రమే జరగగా ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్జరీ ప్రసూతి కాన్పులు చేపడుతున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం హయంలో ఆధునాతన సౌకర్యాలతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటైంది. దీంతో ప్రసవాలు సైతం భారీ స్థాయిలో చేస్తూ రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలు చేసిన రికార్డు కూడా తీసుకువచ్చారు.రామాయంపేటలో కేవలం నార్మల్ డెలివరీలు మాత్రమే చేయగా మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్జరీ ప్రసవాలు సైతం చేస్తున్నారు. దాదాపు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య దాదాపుగా తగ్గిపోయింది. దీంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందుకు ప్రభుత్వ కృషిపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కానీ రెండేళ్ల క్రితం రాష్ట్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మహిళా మృతి నేపథ్యంలో రాష్ట్ర కుటుంబ నియంత్రణ నిలిపి వేశారు. అందులోని ప్రసవాలు సంఖ్య పెరగడం మూలంగా కుటుంబ నియంత్రణ పని భారంగా వైద్యులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిగా నిలిపి వేసినట్టు వైద్యులే చెబుతున్నారు.గర్భిణులకు ప్రసవాలు చేసేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచిన సర్కారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిలిపి వేసిందా అనే సందేహాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు బిల్లు వసూల్ చేయడం మూలంగా చాలా మంది మహిళలకు ఆర్థిక భారంగా మారింది. ఒక వేళ నర్సాపూర్ వెళ్లి సర్జరీ చేయించుకోవాలని భావించిన అక్కడ మూడు రోజుల పాటు ఉండి రావడం పేద ప్రజలకు ఇబ్బందిగా మారింది. జిల్లా కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు కొనసాగించేలా జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సీనియర్ డాక్టర్ శివదయాల్ మాట్లాడుతూ వైద్యాశాఖలో బదిలీల ప్రక్రియ సాగుతుందని, చాలా మంది బదిలీ అయ్యారని, సిబ్బంది పూర్తి స్థాయిలో వచ్చిన తరవాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేస్తామని చెప్పారు.




# గ్లామర్ క్వీన్ ఆఫ్ సౌత్ ఇండియా నటి మంజులకు వర్ధంతి నివాళి

70వ దశకంలో అత్యంత పాపులర్ హీరోయిన్ సౌత్ ఇండియా గా పేరు తెచ్చుకున్న నటి "మంజుల "1969 లో సినీ రంగంలో ప్రవేశించి చిరకాలంలోనే అగ్రతార హీరోయిన్స్ జాబితాలో చేరిపోయింది. అందం, అభినయం, గ్లామర్, చిలిపితనం, డాన్స్, అన్ని మూర్తిభావించిన మంచి నటి మంజుల హీరోయిన్ గా ఎంజీఆర్ తో నటించిన తొలి తమిళ చిత్రం సూపర్ హిట్ కావడంతో దక్షిణ భాష చిత్రాలలో అవకాశాలు వెల్లువెత్తాయి. నాలుగు దక్షణాది భాషల్లో అందరి టాప్ హీరోలతో జతకట్టింది. ఆదర్తి సుబ్బారావు దర్శకత్వంలో హీరో కృష్ణ సరసన నటించిన "మాయదారి మల్లిగాడు "చిత్రం మంజులకు మంచి పేరు తెచ్చి పెట్టింది. ఇందులో పాటలు కూడా శ్రోతలను ఉర్రూతలు ఊగించాయి. మంచి మనుషులు, బంగారు బొమ్మలు, వాడే వీడు, ఇద్దరూ ఇద్దరే, భలే దొంగలు, దొరబాబు వంటి చిత్రాలు మంజుల అభినయ అందాలకి అద్దం పట్టాయి. యుగళగీతాలలో చాలా చలాకిగా నటించేది, తన సినీ కెరియర్లో సుమారు 12 ఏళ్ల పాటు హీరోయిన్ గా నటించి తర్వాత పెద్ద తరహా పాత్రల్లో నటించింది 1976లో ప్రసిద్ధ కన్నడ నటుడు విజయకుమార్ ను పెళ్లి చేసుకుని ముగ్గురు కుమార్తెలకు జన్మనిచ్చింది. ఆమె వర్ధంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళి అర్పిస్తూ....



# రాజుయాదవ్ ఓటీటీ స్ట్రీమింగ్..ఎప్పుడు?



జబర్దస్త్ కామెడీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న హాస్య నటుడు శ్రీను. వివిధ గెటప్స్ తో ప్రేక్షకులను నవ్వించి మెప్పించి గెటప్ శ్రీనుగా, బుల్లితెర కమల్ హాసన్ గా పేరు సంపాదించాడు.ఒకవైపు టీవీ షోలు చేస్తూనే స్టార్ హీరోల చిత్రాలలో హాస్య నటుడిగా, క్యారక్టర్ ఆర్టిస్ట్ గా నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు గెటప్ శ్రీను. స్టార్ హీరోల చిత్రాలలో నటిస్తూ హీరోగా సినిమాలు చేస్తున్నాడు. ఆ ప్రయత్నాలలో భాగంగా టాలీవుడ్ లో తన మొదటి సినిమాగా "రాజు యాదవ్" చిత్రంలో నటించాడు. ఈ చిత్రానికి కృష్ణమాచారి దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో గెటప్ శ్రీను సరసన అంకిత అనే భామ తెలుగు తెరకు హీరోయిన్ గా పరిచయం అయ్యింది. %ఝఎ% 24న తెలుగు రాష్టాలలో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుండి నెగిటివ్ రెస్పాన్స్ దక్కించుకుంది. థియేటర్ రన్ ముగిసే నాటికి డిజాస్టర్ గా మిగిలింది.

# ఈ సినిమా నాకు ఓ అరుదైన అవకాశం...

'మన ఆలోచనల్లోని అంతర్యుద్ధాన్ని ఇప్పటివరకూ ఎవ్వరూ తెరపై చూపించలేదు. తొలిసారి ఆ తరహా ప్రయత్నం మేం చేశాం" అన్నారు రక్షిత్ అట్లూరి. నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే చిత్రం అవుతుందన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఆయన తండ్రి వెంకట సత్య దర్శకత్వం వహించారు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "తండ్రి దర్శకత్వంలో నటించే అవకాశం ఎంతమంది పిల్లలకి వస్తుంది? ఆ అరుదైన అవకాశం ఈ సినిమాతో నాకు దొరికింది. 'పలాస' చేస్తున్నప్పటి నుంచీ నాన్నకు దర్శకత్వం అంటే ఆసక్తి. సినిమా అంటే తపన. అన్నీ తెలుసుకునే దర్శకత్వంలోకి వచ్చారు. 'పలాస' తర్వాత మా సంస్థలో ఎలాంటి సినిమా చేయాలనే చర్చ మొదలైనప్పుడు వచ్చిన ఆలోచనే 'ఆపరేషన్ రావణ్'. నేటితరం ప్రేక్షకులకు నచ్చే ఓ మంచి థ్రిల్లర్ సినిమా నిర్మిస్తే బాగుంటుందని రంగంలోకి దిగాం.



# అశ్విన్ కెరీర్‌లో బెస్ట్ సినిమా....!



గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై అప్సర్ దర్శకత్వంలో అశ్విన్ బాబు హీరోగా, దిగంగనా సూర్యవంశీ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శివం భజే'. ఈ చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. న్యూ ఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్ర ట్రైలర్‌ను మంగళవారం లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హీరో విశ్వక్ సేన్, సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ, "ట్రైలర్ చూశా. చాలా బాగుంది. ఆర్ఆర్ అదిరిపోయింది. అశ్విన్ కెరీర్‌లో ఇది నిలిచిపోతుందనిపిస్తుంది. ఆగస్ట్ 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'అశ్విన్ కెరీర్‌లో ది బెస్ట్ సినిమా అవ్వాలని కోరుకుంటున్నాను. శివేంద్ర నాతో పని చేశాడు. వికాస్ ఆర్ఆర్ బాగుంది. నిర్మాత మహేశ్వర్ రెడ్డికి మంచి సక్సెస్ రావాలి.

డైరెక్టర్ అప్సర్ సినిమాను బాగా తీశారు. తమన్ ఇచ్చిన ఆర్ఆర్ ఇప్పటికీ మార్మోగిపోతూనే ఉంది' అని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ, ' 'ట్రైలర్ రెండ్రోజుల ముందే చూశాను. ఆర్టిస్ట్‌కి టాలెంట్ ఉంటే సరిపోదు.. కసి కూడా ఉండాలి. అశ్విన్‌కు ఆ కసి ఉంటుంది. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి' అని తెలిపారు. 'మహేశ్వరుడి కథ.. నిర్మాత మహేశ్వర్ రెడ్డి వరకు వెళ్లిందని అనిపించింది. డివోషనల్ పాయింట్ ఎందుకు పెట్టామనేది ప్రేక్షకుడు కన్విన్స్ అయ్యేలానే చూపించాం' అని డైరెక్టర్ అప్సర్ చెప్పారు.

# సితార మంచి మనసుకు ప్రశంసలు...!

తెలుగు సినిమా ఇండస్ట్రీలో సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ గురించి మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన తన సినిమాలతో మంచి సక్సెస్ లను అందుకోవడమే కాకుండా తండ్రి కి తగ్గ తనయుడిగా కూడా మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇక ప్రస్తుతం మంచి సినిమాలు చేస్తున్నాడు. ఇక ఇప్పుడు రాజమౌళి డైరెక్షన్ లో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్న విషయ మనకు తెలిసిందే%ఔ% అయితే మహేష్ బాబు ఎన్ని సినిమాలు చేసిన కూడా తనకు వచ్చే రెమ్యూనరేషన్ లో నుంచి కొంత భాగాన్ని పేద ప్రజలకు సహాయం చేస్తు ఉంటారు. ఇక అందులో భాగంగానే చిన్నపిల్లలకు హార్ట్ సర్జరీలు చేయించడం లాంటివి చేస్తూ ఉంటాడు. మరి ఇలాంటి క్రమంలోనే తన కూతురు అయిన సితార కూడా ప్రస్తుతం కొన్ని జ్యూవెల్లరీ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా కొనసాగుతుంది. కాబట్టి తను కూడా తన రెమ్యూనరేషన్ లో కొంత భాగాన్ని పేద విద్యార్థులకు సహాయం చేస్తుందనే విషయం మనలో చాలా మందికి తెలియదు. ఇక ఇప్పుడు అందులో భాగంగానే మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ అయిన నీట్ లో 605 మార్కులు తెచ్చుకొని మంచి ర్యాంక్ సాధించిన నవ్య శ్రీ అనే అమ్మాయి వైద్య విద్యను అభ్యసించాలని అనుకుంటున్న సమయంలో ఆమెకి సితార అండగా నిలిచింది%ఔ% మహేష్ బాబు ఫౌండేషన్ అలాగే సూపర్ స్టార్ కృష్ణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ను నవ్య సంప్రదించింది. ఇక దీంతో నవ్య శ్రీ చదువులకు కావలసిన డబ్బులను సితార అరేంజ్ చేస్తానని చెప్పింది. ఇక ప్రస్తుతానికైతే ఒక లక్ష 25వేల



రూపాయలను తనకు సహాయం గా అందించి ఇంకా ఏ అవసరం ఉన్నా కూడా తమ ట్రస్ట్ ద్వారా ఆమెకు హెల్ప్ చేస్తామంటూ తెలియజేసింది. ఒక 15 సంవత్సరాల పాప (సితార) ఎంబిబిఎస్ చదివే స్టూడెంట్‌కి హెల్ప్ చేయడం అనేది నిజంగా ఒక మంచి విషయమనే చెప్పాలి.

ఇక అందులో భాగంగానే చిన్నపిల్లలకు హార్ట్ సర్జరీలు చేయించడం లాంటివి చేస్తూ ఉంటాడు. మరి ఇలాంటి క్రమంలోనే తన కూతురు అయిన సితార కూడా ప్రస్తుతం కొన్ని జ్యూవెల్లరీ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా కొనసాగుతుంది. కాబట్టి తను కూడా తన రెమ్యూనరేషన్ లో కొంత భాగాన్ని పేద విద్యార్థులకు సహాయం చేస్తుందనే విషయం మనలో చాలా మందికి తెలియదు.